కథ

# కలకానిది-విలువైనది

- ఎన్. శ్రీలత

తూర్పున ఎక్కడో సూర్యోదయం కాబోతున్న సూచనగా చీకట్లు మెల్లమెల్లగా విచ్చుకుంటున్నాయి.

కార్తీక పూర్ణిమ. గుడిగంటలు అదే పనిగా మోగుతున్నాయి.

అప్పటివరకూ బంగారు వన్నె వెన్నెలకాంతిని విరజిమ్మిన చందమామ మొహం తెల్లబోతోంది. ఆ ఉదయ సంధ్యలో పొగమంచు దట్టంగా అలముకుని ఉంది.

తెల్లవారుఝామున మూడు గంటల నుంచీ జనం నాటు పడవల్లో పట్టిసీమ రేవు నుంచి వీరభద్రేశ్వరాలయం ఉన్న పట్టిసం లంకలోకి పోటెత్తినట్టు వస్తున్నారు. ఇసుక మేటలు వెయ్యడం వలన లాంచీలు రాలేవు. అందుకే పడవల వాళ్ళు మంచి హుషారుగా ఉన్నారు. అద్దరి నుంచి ఇద్దరికీ నిమిషాల్లో తెడ్డు వేసేస్తున్నారు. ఏడాదికోసారి అరుదుగా వచ్చే అవకాశం. పడవల నిండా జనాన్ని కుక్కేసి తీసుకొస్తున్నారు. జనం వచ్చిన వాళ్ళు వచ్చినట్టే గోదావరిలో మూడు మునకలేసి తడిబట్టల్తో తపతపలాడుతూ ఆలయంవైపు దారి తీస్తున్నారు. పూజలు, దర్శనాలు ముగించుకున్న వాళ్లని తిరిగి ఇద్దరి నుంచి అద్దరికి చేరవేస్తున్నారు పడవల వాళ్ళు.



అలా జనంతో కలిసి మొదటి పడవలో వచ్చి లంకలో దిగేడు భద్రుడు. అందరితో బాటే అసంకల్పితంగా గోదాట్లో మునకలేసాడు. కాళ్లకింద ఇసుక తగుల్తోంది. ముందుకు పోనీకుండా రక్షణ వలయం ఉంది. గుడివైపు వెళ్లబుద్ధి కాక ఎడమవైపు నిర్జన ప్రదేశం లోకి నడిచాడు. పాదాలు నీళ్ల లోకి వేళ్లాడేసి ఇసుకలో కూర్చున్నాడు. కార్తీక దీపాల వెలుగులో మెరుస్తున్న గోదారి అతని పాదాల్ని కరుస్తోంది. ఓపలేక చటుక్కున పైకి లాకున్నాడు. వెన్నులోని మజ్జ మొత్తాన్ని ఎవరో పీల్చేసుకున్నంత బలహీనత. ఆగలేక వెల్లకిలా వెనక్కి వాలేడు చల్లని ఇసుక తడికి ఒక్కసారి వజ వజా వణికేడు. అతని లోపలి వ్యాకులత త్వరలోనే చలిని జయించింది. రెండు రోజులుగా తిండి, నిద్రలేని అతని శరీరం అలసి సొమ్మసిల్లిపోయింది. నిద్రాదేవి కరుణించి అతని కళ్లమీదికి పాకి వచ్చింది.

దుఃఖంతో నిండిన ఏదో చీకటిలోకంలో విహరిస్తోంది భద్రుడి ఆత్మ. దుఃఖాన్ని భరించలేక మౌనంగా రోదిస్తోంది.

''బతికున్నాడంటావా?''

''ఏమో మరి!''

సర్రున నీటిని కోస్తున్న చప్పుడు.

''ఎగువనించి కొట్టుకొచ్చినట్టుంది శవం. మొన్నీమధ్దెనిలాగే కాదా పాపికొం

డల కాడ అడిపోయిన మనిసి ఈ లంకొడ్డుని తేల్తా''

''ఛా, ఊరుకో. పేణం ఉన్నట్టన్పిత్తంది''.

''మరి, పూటుగా తాగేసడిపోయేడంటావా ఇంత పొద్దున్నే? దగ్గిర కెల్లకయ్యోయ్, పోలీసోళ్లు మనమీదె ట్టెయ్‌గల్రు''.

టక్కున కళ్లు విప్పేడు భద్రుడు. తల తిప్పి చూడగానే ఎడమవైపు పదడుగల కవతల నిక్కరు మాత్రమే వేసుకున్న బక్క పల్చని మనిషి, అతని వెనకనుంచి తొంగి తొంగి చూస్తున్న ఆడమనిషి కన్పించేరు. వాళ్ల వెనక చిన్న నాటుపడవ వొడ్డు మీదికి సగం చేర్చి ఉంది.

చటుక్కున లేచి కూర్చున్నాడు భద్రుడు.

వాళ్లలా అనుకోవడంలో పొరపాటు లేదు. నిద్రలో ఎప్పుడు కిందికి జారి పోయేడోతను, సన్నని నీటి అలలు వచ్చి తనని నడుము వరకూ తడిపి వెళ్తున్నాయి.

తెల్లవారుఝామున మసకకట్టిన దృశ్యాలన్నీ ఇప్పుడు స్పష్టంగా కన్పిస్తున్నాయి. టైం తొమ్మిదికీ పదికీ మధ్య అయి ఉంటుంది. ఎండ తీక్షణతని సంతరించు కుంటోంది. అవతలి వొడ్డున పాపికొండల సందర్శన కోసం జనాన్ని నింపుకొన్న ఏడెనిమిది లాంచీల రణగొణధ్వని గాలి వాలుకి లంకలోకొస్తోంది. వెనక, ఆలయంలో రద్దీ కొంత తగ్గినట్టుంది, గుడిగంటలు ఆగి ఆగి మోగుతున్నాయి.

గోదావరి నీళ్లమీద ఎండ పడి కళ్లలోకి బాణాలు గుచ్చుతోంది. భరించలేక తలవాల్చుకున్నాడు భద్రుడు. ఇసుక పొరమీదుగా వచ్చి తనని తాకి వెళ్తున్న పారదర్శకమైన గోదారి నీటిని చూస్తున్నాడు.

నిద్రతో కొంత తేలికైన మనసులోకి గతం తాలూకు బరువులు, దుఃఖం ప్రవేశించబోతూండగా అతనొచ్చి పక్కన బొత్తన కాళ్లమీద కూర్చున్నాడు. ''ఆ వొడ్డుకి దిగబెట్టమంటారేటి నా పడవలో?'' అన్నాడు చొరవగా.

ప్రశ్న అర్థం కానివాడిలా బ్లేంక్‌గా చూసేడు భద్రుడు.

''నా పేరు సిన్నోడండి, మా యాడది లచ్మి'' అన్నాడు.

ఆమె కొంచెం ముందుకొచ్చి సిన్నోడి పక్కన ఇసుకలో చతికిల పడింది.

''లచ్మి, పడవలోంచి గళాసట్టుకెల్లి గుడికాడ సింవాసెలం కొట్లో టీ యట్రా'' అన్నాడు సిన్నోడు.


లచ్మి వెంటనే లేచెల్లింది.

సిన్నోడు అనునయంగా భద్రుడి చేతిమీద చెయ్యివేసి ''అలాగ పాపికొండల్దాకా వొత్తారేటి బావూ నా పడవలో? సీకటడేయేలకి వొచ్చేద్దారి'' అన్నాడు.

'పాపికొండలు! ఎక్కడ చూసినా అందరినోటా ఇదేమాట. అక్కడ గోదావరి సుడులు తిరుగుతూ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుందట, చివరిగా ఆ కొండల అందాల్ని చూసేసి అక్కడే గోదారల్లో దూకేస్తే... కాని, ఈ పడవ వాడికేమివ్వాలి?...'

''నా దగ్గర డబ్బుల్లేవ్'' అన్నాడు భద్రుడు చికాకు నిండిన గొంతుతో.

భారతదేశంలోని పేదలు డబ్బు పీల్చే జలగలని



సంపన్నులెందరి లాగానో అతనికీ ఒక చులకన భావం.

"అన్నన్నా..." అని ముక్కుమీద వేలేసుకున్నాడు సిన్నోడు. "డబ్బు లడిగేనా మిమ్మల్ని?" అన్నాడు "తవరిదేవూరేటండి, సూత్తుంటే ఇటే పోరిలాగ అపట్టం లేదు".

భద్రుడు అతనివేపు ఆశ్చర్యంగా చూసేడు. గంట లకి విలువ కడుతూ ఇంత కాలం తను జీవించిన జీవితం, తను బలంగా నమ్మిన సిద్ధాంతం తనకి నేర్పి నదేదో ఈ సిన్నోడి ముందు వీగి పోబోతోందా? కాదు కాదు, లోకంలో స్వార్థం తప్ప మరోటిలేదు. తన నుంచి ఏదో ఆశించే వీడు తనతో మాట్లాడు తున్నాడు- లచ్మి టీ గ్లాసు మీద అడ్డాకు ముక్కొకటి కప్పి పట్టుకొచ్చింది.

"పుచ్చుకోండి బాబయ్యా, ఏడేడి టీ సుక్కలు గొంతుకలో కెల్తే కుంత ఓపికొత్తాది" అన్నాడు సిన్నోడు.

ఒక్క నిమిషం తటపటాయించి గ్లాసు అందుకు న్నాడు భద్రుడు. ఈలోగా సిన్నోడు, లచ్మికలిసి పడవని వొడ్డు నుంచి నీళ్ల లోకి నెట్టి పట్టుకుని నిల్చున్నారు.

"రండి బాబూ, వొచ్చి పడవెక్కండి" అన్నాడు సిన్నోడు.

భద్రుడు మంత్ర ముగ్ధుడిలాగా లేచెళ్లి పడవ ఎక్కేడు. పడవ మధ్యలో ఉన్న బల్లచెక్క మీద కూర్చు న్నాడు. కాళ్లకింద పరిచినట్టున్న చేప పొలుసులు చూసి పాదాలు పైకి తేల్చుకోబోయి మానేసాడు. చెప్పులెటు కొట్టుకు పోయేయో, నీటిలో నాని నాని పాదాలు వొరిసిపోయి తిమ్మిరిగా ఉన్నాయి.

సిన్నోడు పడవలోంచి పొడవైన గెడకర్ర తీసుకుని పడవని లోతు నీటిలోకి మళ్లించేడు. తర్వాత గెడని పడవలో పెట్టి చెరో తెడ్డూ తీసుకుని నడపడం మొదలు పెట్టేరు. నదికి కుడి వైపునుంచి పడవ నెమ్మ దిగా ఎగువకి ప్రయాణం సాగించింది. భద్రుడు మెడ వెనక్కి తిప్పి పట్టిసీమ ఆలయ సముదాయాల వైపు చూసేడు. వివిధ పరిమాణాల ముత్యాలు గుండ్రంగా పేర్చినట్టు ఎండలో తెల్లగా మెరుస్తున్నాయి.

'ఇదే చివరి చూపు' అనుకున్నాడు.

ఎక్కడి చికాగో నగరం! ఎక్కడి పట్టిసీమ! భద్రుడు. వి.మేచినేని. మేచనేని వీరభద్రుడు. ఐ.ఐ.టి. గోల్డ్ మెడలిస్ట్, ప్రముఖ అమెరికన్ కంపెనీలో కొద్ది కాలం లోనే మేధావిగా పేరొందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, హాఫ్ మిలియన్ డాలర్స్ ఫర్ యానమ్ సేలరీ, అంద మైన అమెరికన్ భార్య, ముద్దులు మూటకట్టే కొడుకు, రాజభవనం లాంటి ఇల్లు, ఒక బి.ఎం. డబ్ల్యు, మరొక బెంజి కార్లు. జీవితమనే పరమపద సోపానపటంలో చాలా తొందరగా నిచ్చెనలెక్కి, ఒక్కసారిగా పెద్ద పాము నోట్లోకెళ్లిపోయి బయలుదేరిన చోటికి తిరిగొ చ్చాడు. ఆర్థిక సంక్షోభం కారణంగా చాలా కంపెనీ ల్లాగే తమ కంపెనీ మూత పడింది.


ఉద్యోగం ఊడిపోయిన నెల తర్వాత తెలిసింది. తను ఎంత లగ్జోరియస్ లైఫ్‌కి అలవాటు పడిపోయిందీ!

'జీవితమే ఒక మహానుభూతి. దాన్ని ఒక అద్భుత మైన అనుభవంగా మలచుకుందాం' అంటూ బ్రౌనీని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. దేశాన్ని, మతాన్ని, తన వనే అన్నిటినీ వదిలేసాడు. ఇక్కడైతే అన్నీపోయినా భార్యైనా మిగిలుండేది. ఆర్జన ఉంటేనే భార్య, కొడుకు; లేకుంటే ఏదీ నీది కాదు అని నిరూపించింది బ్రౌనీ, అప్పుడే తనకి జీవితం మిథ్య అన్పించింది, చచ్చిపోవాలన్పించింది. ఆ చావేదో దేశం కాని దేశంలో ఎందుకు అనామకంగా...? నాది అనే పుట్టిన గడ్డపై కొచ్చి, తనవాళ్లు నలుగుర్నీ చూసి... ఒక్క రోజులో ఆ నిర్ణయం బలపడి, తన దగ్గర మిగిలిన వేవో అమ్ముకుని ఫ్లైటెక్కి ఇక్కడికి వచ్చిపడ్డాడు.

తీరా తనవూరికెళ్తే తను ఇన్నాళ్లుగా పట్టించుకోని తల్లి ఎప్పుడో పైలోకం చేరుకుందని తెలిసింది. అంత పెద్ద ఆస్తీ, దివాణం లోగిలీ అన్నీ అమ్మేసి రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టి నష్టపోయి తనలాగే దీనస్థి తిలో ఉన్న అన్నగారు, లక్ష్మీదేవిలా ఉండే వదినా, చిల కల్లాంటి పిల్లలూ అంతా రెండు గదుల అద్దె ఇంట్లో పెద్దమ్మవారు ఆవహించిన దీనస్థితిలో... చూడలేక వెంటనే బస్సెక్కి రాజమండ్రిలో దిగేడు, చచ్చిపోవా లనే లోపలి కాంక్ష చావక.

"అన్నయ్య తర్వాత పన్నెండేళ్లకి పట్టిసం వీరభద్రే శ్వరుణ్ణి దర్శించుకున్నాక నువ్వు పుట్టేవు. అందుకే నీకా పేరు పెట్టుకున్నాం" అనేది తల్లి. చివరిసారిగా గోదావరి బ్రిడ్జి మీది నుంచి ఆ ఆలయ శిఖరాన్ని చూసి గోదారి ప్రవాహంలో దూకెయ్యాలని ఒక నిర్ణ యానికొచ్చాడు. రాత్రి మనసంతా నిండిన నిర్వే దంతో బ్రిడ్జి మధ్య వరకూ నడిచి, గొప్ప ఆవేశమేదో కమ్ముకొచ్చి దూకెయ్య బోతూండగా, వెనక రెయి లింగ్ మీద లారీ చప్పుడు, గార్డు కేకలు విన్పించాయి. పూర్తిగా వెనక్కి తిరిగి చూడకుండానే పరుగులాంటి నడకతో బ్రిడ్జికీవైపున కొవ్వూర్లో వచ్చి పడ్డాడు.

అప్పుడర్థమైంది తనెంత పిరికివాడో! అక్కడి నుంచి పట్టిసీమకీ, పట్టిసం లంకమీదికీ తన ప్రమేయం లేకుండానే వచ్చిపడ్డాడు.




"బాబూ, తవరికి పెళ్లైందా, పిల్లలా?"

"....."

"అయ్యే ఉంటాదిలే, ఇద్దరు పిల్లలై ఉంటారు. అవునా బాబూ"

మొహం తిప్పుకొన్న భద్రుడికి ఎడమవైపు ఇసుక తిన్నెల కవతల లోతైన నీటిలో నెమ్మదిగా ఒకదాని వెనక ఒకటి వెళ్తున్న లాంచీలు...

"ఆ బాబేటో ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నాడు, నువ్వేమో లొడలొడా ఒకటే వాగుడు" అని విసుక్కుంది లచ్మి.

"ఓలూరుకోయే, మెల్లిగా మాటల్లో దింపి ఆ బాబుని మనసుల్లోకి మళ్లించాలని కదా నా పాట్లు. మొకం సూత్తే తెల్టం లేదా, ఏదో గొప్ప బాధలో ఉన్నా డని" అని లచ్మి చెవిలో గునగునలాడేడు సిన్నోడు.

"అవునా..." అని కళ్లు రెపరెపలాడించింది లచ్మి.

"మాకిద్దరికీ ఈ మద్దినే పెళ్లయ్యిందండి. సేను కుంటే గాని వొల్లకాదని కూకున్నాడండి మామయ్య. సేపలు పట్టుకు బతకమని ఈ పడవిచ్చేడనుకోండి. నేను సేసుకోపోతే ఈ నల్ల పిల్లికి మొగుడెక్కడ దొరు కుతాడ్లే అని జాలితో సేసుకున్నానండి. ఇంకా పిల్లా జెల్లా కలగలేదండి".

"ఓయ్ బాబో, ఏటి మరీ! నువ్వు సేలా తెల్లగా మెరిసిపోతన్నావ్, అందగాడివి. రోజా ఏదో వొంకొం కని మా ఇంటిసుట్టూ తిరుగు తున్నావని కాదేటి మామయ్య నిన్నల్లుణ్ణి సేసుకున్నాడు".

"మాటన నివ్వదు దొంగనా పొలస. మా గోలకేం గాని బాబూ! ఎడం పక్క కొండమీద ఆ పెద్ద కరంటు తంబం పక్కని ఉన్నదే పొండు రంగడి గుడి. అక్క ణ్నుంచి గోదారికీయేపు తంబం మీదకి లాగేరండి కరంటు. గొప్ప సిత్రం కదా బాబూ!" సిన్నోడి గొంతులో సంభ్రమం.

ముభావంగా కూర్చున్న భద్రుడి మొహంలోకి నవ్వు రాబోయి ఆగింది. అజ్ఞానంలోనూ ఆనందము న్నట్టుంది.

ప్రకృతి భద్రుడి చూపుల్ని పట్టి తన వేపు లాక్కో సాగింది. గోదావరి కిరువైపులా ఉన్న కొండల హరిత వర్ణం అతన్ని చూపు తిప్పుకోనివ్వడం లేదు.

ఏటికెదురీదుతున్న గూటి పడవ. మేటలు వేసి మెరుస్తున్న బంగారు ఇసుక. గంభీరంగా ప్రవహించి వస్తున్న గోదావరి. కొండకోనల్లోంచి వచ్చి కలుస్తున్న పిల్ల కాలువలు.

ఈ లౌకిక ప్రపంచంతో సంబంధాలు తెంచేసు కున్న అనుభూతి.

గొప్ప తాదాత్మ్యంలో మునిగిపోయాడు భద్రుడు. మనసు తేలికై మౌనంగా నర్తిస్తోంది.

నెమ్మదిగా నీటిని చీల్చుకుని వెళ్తున్న పడవలాగే బాధల జ్ఞాపకాల బరువుల్ని చీల్చుకుని వెళ్తోంది మనసు.

"ఆ కుడేపు కనపడేదే పోశమ్మ గండి" అన్నాడు సిన్నోడు.

లాంచీలన్నీ కుడివైపు మళ్లి వొడ్డుకెళ్లి ఆగుతు న్నాయి. జనం బిలబిలమంటూ దిగి ఎత్తైన గట్టు పైకెక్కి పోచమ్మ గుడివైపు వెళ్తున్నారు.

పడవ వొడ్డుకు చేరింది. "అమ్మోరి దరిశనం సేసు కుందారి వొత్తారాబాబూ" అన్నాడు సిన్నోడు. దుకా

ణాల పాకల వెనకనుంచి ఆలయ శిఖరం మీది కలశం, కొమ్ములు మెరుస్తున్నాయి.

భద్రుడు కదలకపోవడం చూసి తెడ్లు పడవలో పడేసి, గెడ నీటి అడుగుకు గుచ్చి లచ్మికి అందించి, వొడ్డుకి దూకి గుడి వేపు పరుగెత్తేడు సిన్నోడు. లచ్మి గెడను చంకలో ఇరికించుకుని, చెంపలేసుకుని, చేతులు జోడించి కళ్లు మూసుకుంది.

భద్రుడు మొదటిసారి ఆమె వైపు పరిశీలనగా చూసేడు. ఏ మాత్రం ఆకర్షణ లేని సాదాసీదా ఆడమనిషి. వొత్తైన జుట్టుని నెత్తి పైన శిగలా చుట్టి ప్లాస్టిక్ క్లిప్పేదో పెట్టింది. శిగలో ఓ పక్కన నిర్లక్ష్యంగా తురిమిన పేరు తెలియని పసుపు రంగు పువ్వు. సిగకు అందని ముంగుర్లు చెవులమీదా, ముఖం మీదా పారాడు తున్నాయి. సాదా చీర, తెడ్డు వెయ్యడం వలన చెమటకు తడిసిన ఎర్రని జాకెట్టు. ఆమె ముఖం నవ్వుతో వికసించడం చూసి అటు చూసేడు. గట్టు మీంచి పరుగెత్తుకొస్తున్నాడు సిన్నోడు.

పడవెక్కినప్పట్నుంచి చూస్తున్నాడు – వాళ్లిద్దరి మధ్య నవ్వులు, గుసగుసలు, కువకువలు, దొంగచూపులు, దోర స్పర్శలు, వైవాహిక జీవితంలోని ఇలాంటి ఆనందం ఎప్పుడైనా తనకి అనుభవంలో కొచ్చిందా? ఏం బతుకు అది? రోజులో ఏ రెండు గంటలో నిద్రకు కేటాయించుకుని కంప్యూటర్‌కి, సంపాదన పెంచుకునే వ్యాపకాలకీ అతుక్కుపోయిన జీవితాలకి ఈ ఆనందం, ఈ ప్రేమ ఎలా అనుభూతికొస్తుంది? సిన్నోడు కొబ్బరి చెక్కని పడవ అంచుమీద చితక్కొట్టి ఒక ముక్కని భద్రుడికి అందించేడు. మరో ముక్కని లచ్మి నోటి కందించి, పొట్లంలో తెచ్చిన కుంకుమ బొట్టు పెట్టేడు. చెంపలేసుకుని గుడి వేపు చూస్తూ "గండి పోశమ్మ తల్లే, అందర్నీ సల్లగా సూడు తల్లీ" అని ఒక కేక పెట్టేడు.

తెడ్డు చేతిలోకి తీసుకుంటున్న లచ్మి సిన్నోడి వీపు మీద ఒక్కటి చరిచి కొంటెగా నవ్వింది.

సిన్నోడు వీపు తడుముకుంటూ "ఏటే, పెద్దమడిసి పడవలో ఉండగా మోటు సరసాలు!" అని కోప్పడుతూ నవ్వేడు. "బావా" అని కేక వినబడి వొడ్డుకేసి చూసేడు.

సింతాలు చంకల్లో కర్రల్తో కుంటుకుంటూ వచ్చేడు. చెయ్యి చాపి నిల్చున్నాడు. నిక్కరు జేబులోంచి రూపాయబిళ్ల తీసి వాడి చేతిలో వేసేడు సిన్నోడు.

"బావా! అట్నుంచొచ్చేటప్పుడు సిన్నసేపలేవన్నా దొరికితే ఒక గుప్పుడు ఇక్కడడేసి పోవా, పులుసు తినాలనుంది" అన్నాడు సింతాలు.

"సర్లే, ఎవరిసేతైనా నేనంపిత్తాన్లే. సలిలో నువ్విక్కడే కూకునుండకు, పొద్దోతాది మేవొచ్చేతలికి".

కృతజ్ఞతగా చూస్తూ నవ్వేడు సింతాలు.

"ఈడి కతేటో తెలుసా బాబూ" అంటూ మొదలు పెట్టేడు సిన్నోడు–

"పోలారం ఆనకట్ట గురించి అనుకుంటున్న తొలి రోజుల్లోనే కొన్ని గూడేలోళ్లకి ఇళ్లకీ, బావులికీ ఇంతా అని లెక్కకట్టి డబ్బులిచ్చేసేరు గవుర్మెంటోళ్లు. ఈ సింతాలు గాడికి లచ్చా పాతికేలు వొచ్చేయి. ఈడు పుట్టేక అన్ని డబ్బులెప్పుడైనా కళ్లా సూసున్నాడా!? అందుకే ఆ డబ్బులేం సేసుకోవాలో ఈడికర్థం అవలేదు. ముందు ఒక మోట్రు సైకిలు పెద్దది కొనేసేడు. ఈ ఎదవకి నడపడం వొచ్చంట లెండి. సేలా స్పీడు నడిపీవోడు. ఇంకవో.. సూసుకోండి జెల్సా... ఈడికీ, పెళ్లానికీ, పిల్లలకీ రంగురంగుల గుడ్డలు, ఈడికి వాసీ, ఉంగరం, రోజూ బండేసుకుని రాజిమండ్రం పోటం, వొటేల్లే పులావులూ గట్టా తింటం, కరీదైన బ్రేందీకాయలు కడుపు నిండా ఫుల్లుగా పట్టించటం, సినిమాలు సూట్టం. ఒక రోజులాగొత్తావొత్తా లారీని గుద్దేసేడు. పెళ్లాం పిల్లలక్కడే ప్రేణాలొదిలేసేరు. ఈనా కొడుకు సావుతప్పి కన్నులొట్టోయి ప్రేణాల్తో మిగిలేడు, అదిగో అలాగ రెండు కాళ్లూ సకం సకం పోగొట్టుకుని. అప్పుడికే డబ్బులు కడకొచ్చేసేయి. మిగిలిం డబ్బులు ఆస్పటలు కర్సుల కిందెల్లి పోయేయి. అప్పణ్నుంచీ ఇదిగో ఇలాగ గండిపోశమ్మ గుడికాడ అడుక్కుతింటా బతుకుబండిని లాక్కొత్తన్నాడు".

సింతాలు అతికష్టం మీద ముందుకి కదులుతున్నాడు. అతనితో పోలిస్తే తన కష్టం ఏపాటిది? ఒక జీవన సత్యమేదో మెరుపులా లోపలికి ప్రవేశించి భద్రుడి విషాదాన్ని కోస్తోంది.

"ఒక్కముక్క సెప్తానండి. మీకు సెప్పేటంతోణ్ణి కానుకోండి, మీరేదో కస్టంలో ఉన్నారని మాత్రం నాకర్థమైందండి. 'కష్టాలు మనసులికి కాక మానులకొత్తాయా అనీవోడండి మాయయ్య. ఆడు అంతరవేదికాడ సంద్రంలో సేపలు పట్టీవోడండి. వోరి సిన్నోడా! ఇంత పెద్ద సంద్రంలో మనిసి ఒక్క నీటి బొట్టు కన్నా తక్కువేరా. ఒకేల పడవ మునిగిపోతే మనవూ మునిగి పోకూడదు. మనకి సేతనైనంత వరకూ ఈదాల. పేణం కాపాడుకోవాల. ఉంకో పడవ సంపాదించుకోవాల' అనీవోడు".

ఎండ నడినెత్తికొచ్చింది. చెమటలు కక్కుతూ త్వరత్వరగా తెడ్లేస్తున్నారు సిన్నోడు, లచ్మి.

"బాబూ, మీరా గూట్లోకెల్లి కూకోండి, ఎండ బరించలేరు"

వాళ్లిద్దరూ అంతకష్టపడుతూంటే తను హాయిగా కూర్చున్నాడనే స్పృహ కలిగి భద్రుడికి సిగ్గనిపించింది. మొదటిసారి మనసువిప్పి "లక్ష్మిని వెళ్లి కూచోమను, నేను తెడ్డు వేస్తా" అన్నాడు.

ఏం విన్నారో మొదట అర్థం కాక, అర్థమయ్యేక ఫక్కున నవ్వేరిద్దరూ. "ఈ పని మీవల్లవ్వద్దేటండి, అవ్వదండి" అన్నాడు సిన్నోడు.

పడవ దేవీపట్నం చేరుకుంది. గట్టుపైన దూరంగా కన్పిస్తున్న పాత చిన్న పెంకుల లోగిలిని చూపించి "ఆ కాలంలో అల్లూరి సీతారామరాజు గారు పితూరీ సేసిన దేవీపట్నం పోలీసుస్టేషన్ అదేనండి" అన్నాడు సిన్నోడు అతని మొహంలో ఒక అద్వితీయమైన పులకింత.

'అప్పటికీ సిన్నోడి తండ్రి కూడా పుట్టి వుండడు. కాని, విదేశీయులకి వ్యతిరేకంగా పోరాడిన సీతారామరాజు శౌర్యాన్ని తల్చుకుని ఇప్పటి సిన్నోడు పులకించిపోతున్నాడు. ఇదేనా దేశం మీది ప్రేమ అంటే' అనుకున్నాడు భద్రుడు.

నదికి ఎడమవైపు ఇసుక తిన్నెల వొడ్డున లాంచీలు ఒకటొకటిగా వెళ్లి ఆగుతున్నాయి. ఇటు దేవీపట్నం వైపు పది పన్నెండు పడవలు ఉన్నాయి. ఉన్నట్టుండి వూళ్లోంచి పెద్ద పెద్ద డ్రమ్ముల్తో, కేనుల్తో అన్నం, కూరలు లాంటి వంటకాలు మోసుకొచ్చి పడవల్లోకి ఎక్కిస్తున్నారు కొందరు. పడవలు నదికి అడ్డంగా అవతలి వొడ్డుకెళ్లి లాంచీలకు ఈ ఆహార పదార్థాల్ని అందించి వస్తున్నాయి.

భద్రుడిని వొడ్డున దింపేసి సిన్నోడు ఒకసారి అందించి వచ్చేడు. రెండోసారి అతన్ని పడవలో ఎక్కించుకుని తీసుకెళ్తూ కొంత దూరంలో వొడ్డుకి దగ్గరగా అక్కడక్కడ నీటిపైన తేలుతున్న ఖాళీ ప్లాస్టిక్ వాటర్ బోటిల్స్‌ని చూపించాడు. "ఆ కనిపించీ సీసాల అడుగుని మా వలలున్నాయండి. ఆ పక్క నించి ఈ లాంచీలన్నీ ఎల్లిపోయేక పడవలోళ్లందరం వలలెత్తి, సేపల్ని పడవల్లో ఏసుకుని, మళ్లీ వలలు పన్నేసి, రాజమండ్రం కేసి ఎల్లిపోతావండి. సందేళ బజారుకి సేవలందించాల. తవరి గురించి లాంచీవోళ్లతో మాటాడేనండి, తవరికి బోయినం ఆళ్లే ఎడతారు. ఈ లాంచీలన్నీ ఆ దూరంగా కనపడతన్నాయి పాపికొండలు – దూరపు కొండలు నునుపులెండి – ఆట్ని దాటుకుని ముందుకి పేరంటాలపల్లి దాకా ఎల్లి రేత్రికి ఎనక్కొచ్చేత్తాయండి" అన్నాడు. కొంత ఆగి "బాబూ, ఈ పడవని సూత్తన్నారా, ఉప్పుడుదాకా కస్టంగా ఏటికెదురీదు కొచ్చిందండి. ఉప్పుడు ఏటిని కోసుకుని అడ్డంగా ఎల్తందండి. ఎల్లీటప్పుడు ఏటివాలుకి జయ్యిమని నల్లేరుమీద నడకలాగెలిపోద్దండి. పడవకైనా మనసికైనా ఎప్పుణ్ణడక అప్పుడిదేనండి. ఎత్తైన పాపికొండల్నీ, అక్కడ లోతైన గోదారమ్మనీ సూసేక మనవెంత సిన్నోళ్లవో మనకర్థమౌతాదండి. తవరు తప్పకుండా అక్కడిదాకా ఎల్లి ఎనక్కి రావాలండి. మీ గురించి నాకు తెల్సుగానండి. ఒక్క ముక్క సెప్తానండి. మీకు సెప్పేటంతోణ్ణి కానుకోండి, మీరేదో కస్టంలో ఉన్నారని మాత్రం నాకర్థమైందండి. 'కస్టాలు మనసులికి కాక మానులకొత్తాయా అనీవోడండి మాయయ్య. ఆడు అంతరవేదికాడ సంద్రంలో సేపలు పట్టీవోడండి. వోరి సిన్నోడా! ఇంత పెద్ద సంద్రంలో మనిసి ఒక్క నీటి బొట్టుకన్నా తక్కువేరా. ఒకేల పడవ మునిగిపోతే మనవూ మునిగి పోకూడదు. మనకి సేతనైనంత వరకూ ఈదాల. పేణం కాపాడుకోవాల. ఉంకో పడవ సంపాదించుకోవాల' అనీవోడు". సిన్నోడి కళ్లల్లోని మెరుపుని చూస్తున్నాడు భద్రుడు.

తన హృదయంలోని బరువుని సిన్నోడు చేతితో తీసేసినట్టన్పించింది. ఆవేశంలోనైనా చావడం, చంపడం పరిష్కారం కాదని అర్థమైంది.

లాంచీ ఎక్కడానికి బల్లకట్టుమీద ఒక అడుగు వేసిన వాడు హఠాత్తుగా వెనక్కి తిరిగి సిన్నోణ్ని కౌగలించుకున్నాడు భద్రుడు. సిన్నోడు ఆనందంగా కలిపి వదిలిన చేతిని చూసుకుంటే కొన్ని నలిగిన నోట్లూ, చిల్లరా ఉన్నాయి. కంగారుగా పట్టుకోబోతే అప్పటికే సిన్నోడు లాంచీ మీంచి నదిలో ఛెంగున చేపలా దూకి బారలు వేసుకుంటూ పడవ దగ్గరికి ఈదుతున్నాడు.

నాలుగుబారలు అవతలికి పడవను పోనిచ్చిన లచ్మి వాణ్ణి చూస్తూ మూత్యాలొలకబోసినట్టు నవ్వుతోంది.

*

ఎస్.శ్రీలలిత
సెల్: 98664 67062